క్లుప్తంగా

నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కుక్కునూరు: పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే గౌస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 40 ఏళ్ల నుంచి ఆదివాసీలు పోడు భూముల్లో పంటలు వేసి సాగుచేస్తున్నారని, పోడు భూములకు పట్టాలివ్వాలని అనేకమార్లు దరఖాస్తు చేసినప్పటికీ ఇప్పటివరకు పట్టాలివ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పరామర్శ



పి.అంకంపాలెంలో వెంకట్రావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భయ్యా వెంకటరావు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం ఆయన్ను పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన పార్టీ నేత బొంతు వెంకట్ పాము కాటుకు గురై ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. వెంకట్‌ను కూడా బాలరాజు పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, బుట్టాయగూడెం మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, నాయకులు ములకాల బాబు, చిట్టిబొమ్మ శ్రీను, పేరాబత్తుల వినయ్, ఆకుల రవి, దాకారపు చిననాగు, గుర్రాల సుధాకర్, పేరాబత్తుల మధు, సిరిబత్తుల భాస్కర్, దాకారపు నాగేశ్వరరావు, బచ్చల హరి, దొడ్డాకుల నాగేశ్వరరావు, తమ్మా మురళి, తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



గంగానమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో గ్రామదేవత గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో భక్తులు జాతర మహోత్సవాలు జరుపుకోవాలన్నారు. గంగానమ్మ తల్లి కరుణతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, నాయకులు ములకాల బాబు, చిట్టిబొమ్మ శ్రీను, పేరాబత్తుల వినయ్, ఆకుల రవి, దాకారపు చిననాగు, గుర్రాల సుధాకర్, పేరాబత్తుల మధు, సిరిబత్తుల భాస్కర్, దాకారపు నాగేశ్వరరావు, బచ్చల హరి, దొడ్డాకుల నాగేశ్వరరావు, తమ్మా మురళి పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో రైతు సంఘం శిక్షణ తరగతులు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లిలో ఈనెల 10, 11 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు సంఘ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంఘం కూరగాయల షెడ్‌లో ఉదయం 10 గంటల నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ఆయన పేర్కొన్నారు. కావున రైతు సంఘం మండల కమిటీ సభ్యులు, గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు ఈ తరగతులకు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఆలయాల్లో చోరీలు

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు ప్రాంతంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం రాత్రి వరుసగా మూడు గుడుల్లో చోరీలకు పాల్పడ్డారు. గుడి తలుపులు పగలకొట్టి హుండీల్లో సొమ్మును ఎత్తుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారు మాదేపల్లి రోడ్డులో సుంకరివారి తోటకు వెళ్లే కూడలిలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో దొంగలు పడ్డారు. గుడి తలుపులు పగలకొట్టి లోనికి చొరబడ్డారు. అక్కడ హుండీని పగలకొట్టి అందులో నగదు దోచుకున్నారు. సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడి, పోలేరమ్మ గుడిలో కూడా చొరబడి హుండీల్లో సొమ్ము కాజేశారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై రాజారెడ్డి సోమవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ సీసీ పుటేజీలు గమనించగా దొంగ గుడి తలుపు తాళాలు పగలకొడుతున్న దృశ్యాలు కనిపించాయి. కనకదుర్గమ్మ గుడి పూజారి దేవూరి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

ఘనంగా డాక్టర్స్ డే



చింతలపూడి: మానవత ఆధ్వర్యంలో వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల: విర్డ్ ఆస్పత్రిలో వైద్యులకు సత్కారం



కొయ్యలగూడెం: డాక్టర్ ఆనందం సుబ్బారావుని సన్మానిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు



లింగపాలెం: వైద్యాధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

చింతలపూడి: వైద్య వృత్తిని దైవంగా భావించి పేదలకు సేవ చేసినప్పుడే డాక్టర్‌గా విజయం సాధించినట్లు అవుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు చిల్లపల్లి విజయలక్ష్మి అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యులు బండి లక్ష్మీ ప్రసాద్, రామకృష్ణ, మణికంఠ, తౌషిఫ్, హరీష్, భవ్యలను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ పేదలకు సేవ చేసే భాగ్యం వైద్య వృత్తికే ఉందని అన్నారు. వైద్యుల సేవలను వెలకట్టలేమని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జీఎస్‌టి కోఆర్డినేటర్ చిల్లపల్లి రామ్మోహన్‌రావు, కార్యదర్శి మాధవి, జెడ్‌సీలు గోలి చంద్రశేఖర్‌రెడ్డి, అబ్బయ్య, చిక్కాల సుధాకర్, అడపా శ్రీను, పక్కాల వెంకటేశ్వరరావు, భగవాన్ శంకర్, కొత్తపూడి శేషగిరిరావు, కొనకళ్ళ నెహ్రూ, కేశవరావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో ..

మానవత ఆధ్వర్యంలో డాక్టర్స్‌డేను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా ఎండీ రసూల్, డా నారాయణరావు, పి సూర్యకుమారి, ఎస్‌కే హఫీజాఖాన్, వి దివ్య, జె జ్యోత్స్న, వి నవీన్‌కుమార్, డా రామకృష్ణ, డా మణికంఠ, డా తౌషిఫ్, డా హరీష్, డా భవ్య, దంత వైద్యులు డాబి రాంబాబు నాయక్, డా లక్ష్మణ్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షురాలు కె రాజేశ్వరి, కార్యదర్శి పి సోమశేఖర్, కోశాధికారి విశ్వేశ్వరరావు, చైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, కన్వీనర్ కె నాగ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కనిపించే దేవుళ్లు వైద్యులు

ద్వారకాతిరుమల: కనిపించే దేవుళ్లు వైద్యులని.. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వారు అందించిన సేవలు మరువలేనివని విర్డ్ ఆస్పత్రి ట్రస్ట్ కోశాధికారి వెంపరాల నారాయణమూర్తి అన్నారు. స్థానిక విర్డ్ ఆస్పత్రిలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలను ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి ఆస్పత్రి వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఎస్ గోపీ, పి.జితేంద్రలకు దుశ్శాలువాలు కప్పి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యులు గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవాభావంతో అందిస్తున్న సేవలు చాలా గొప్పవని అన్నారు. ఆపద సమయంలో ప్రాణాలను నిలిపే దేవుళ్లు వైద్యులని, వారిని గౌరవించుకోవడం మన విధి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు కొఠారు వెంకట నరసింహారావు, క్లబ్ ఉపాధ్యక్షుడు మొగతడకల లక్ష్మీరమణి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ పులపా ఆనంద్‌కుమార్, మొగతడకల శ్రీనివాసరావు, తూంపాటి పద్మవరప్రసాద్, ఒంటిపల్లి ప్రసాద్ తదితరులున్నారు.

వైద్యాధికారులకు సన్మానం

లింగపాలెం: రోగులకు వైద్య సేవలు అందించడంలో ఉన్న తృప్తి అనిర్వచనీయమని గోకవరం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్.కృష్ణకిషోర్ పేర్కొన్నారు. వైద్యులు ప్రత్యక్ష దేవుళ్లు అని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ అన్నారు. సోమవారం కె.గోకవరం పీహెచ్‌సీలో డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ కృష్ణకిషోర్ డాక్టర్ ఆబిదలను సిబ్బంది ఘనంగా సన్మానించి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు టి.నాగేంద్ర, సరూప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో...

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెంలోని డాక్టర్లు రాజశేఖర్, విజేత, ఆనందం సుబ్బారావు, కనకరాజులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మా కామరాజు, కొల్లూరు శ్రీనివాస్, వీఎస్ఎన్ స్వామి, గుడిమెట్ల గంగాధరరావు, మోటమర్రి ఉమామహేశ్వరరావు, పాల్గొన్నారు.

పంచాయతీ ఈవో శ్రీనివాసరావుకు సత్కారం



శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్‌ల ఛాంబర్ సభ్యులు

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన గరికిపాటి శ్రీనివాసరావును సోమవారం ఘనంగా సత్కరించారు. రేపల్లెవాడ రోటరీ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దంపతులను శాలువాలతో సత్కరించి అభినందించారు. సర్పంచ్‌ల ఛాంబర్ సభ్యులు శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు. సర్పంచులు మద్దిపాటి నాగమణి, ఏలేటి చిన్న తుక్కయ్య కడకట్ల గడ్డియ్య, ఈవో సీహెచ్ సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎంపీటీసీ గంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్



కొమ్మరలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎన్నో పోరాటాలు చేసిన యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ నాయకుడు బొండాడ వెంకన్నబాబు అన్నారు. మండలంలోని కొమ్మర గ్రామంలో సోమవారం జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అందులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేత వెంకన్నబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాండ్ర సురేష్‌బాబు, గ్రామ సర్పంచ్ మానుకొండ మణి, భీమయ్య జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ భారత తొలి దళిత ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అప్పట్లో చదువుకు దూరమై, దుర్భర జీవితాన్ని గడుపుతున్న దళిత దీనజనుల కోసం జీవితాంతం శ్రమించిన సంస్కరణల యోధుడు జగ్జీవన్‌రామ్ అని చెప్పారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, సామాజిక సమానత్వానికి మద్దతుగా ఆయన ఎన్నో పోరాటాలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పీడిత ప్రజల గొంతుక జగ్జీవన్‌రామ్ అని, ఆయన చేసిన పోరాటాలు ఈ తరం వారికి ఆదర్శప్రాయమన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

తాగునీటిని అందించండి మహాప్రభో

వసంత్‌నగర్ కాలనీవాసుల వేడుకోలు



ఎంపీడీవో తిరుపతిరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న వసంత్‌నగర్ కాలనీ మహిళలు

ద్వారకాతిరుమల: తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క అల్లాడుతున్నాం.. దయచేసి మాకు మంచి నీటిని అందించండి మహాప్రభో అంటూ స్థానిక వసంత్‌నగర్ కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలో పలువురు మహిళలు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తిరుపతిరావును కలసి మంచినీటి సమస్యను వివరించి, వినతి పత్రాన్ని అందజేశారు. గత 6 నెలలుగా తమకు మంచినీరు సక్రమంగా అందక, తాగునీటి కోసం ఎన్నో తిప్పలు పడుతున్నామని చెప్పారు. సుమారు 7 వందల ఇళ్లకు ఒక్కటే మంచినీటి బోరు ఉండటం, అది కూడా నీటిని సక్రమంలో అందించలేకపోవడం వల్లే సమస్య తలెత్తిందని అన్నారు. రోజురోజుకు నీటి సమస్య అధికమవుతోందని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీలో కొత్త బోరును నిర్మించి తమకు నీటి కష్టాలను తొలగించాలని ఎంపీడీవో తిరుపతిరావును కోరారు. దాంతో వసంత్‌నగర్ కాలనీ వాసులకు వెంటనే ట్యాంకర్లతో మంచి నీటిని అందించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావుకు ఎంపీడీవో సూచించారు. నూతన బోరు నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపట్టి, నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.

ముగిసిన చండీ హోమం



కొయ్యలగూడెంలో నిర్వహించిన చండీ హోమంలో పూర్ణాహుతికి ద్రవ్యాలు వేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: యజ్ఞయాగాదుల నిర్వహణ భారతదేశ సంస్కృతి సంప్రదాయాలకు ఆలవాలం అని కాత్యాయని పీఠాధిపతి బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు. మూడు రోజులుగా నిర్వహించిన శ్రీ చండీమాత హోమం సోమవారంతో ముగిసింది. మూడు రోజులపాటు శ్రీలక్ష్మీ గణపతి హోమం, రుద్రయాగం నిర్వహించిన అనంతరం హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించడంతో యాగం పరిసమాప్తి అయ్యింది. ఈ సందర్భంగా హోమంలో పాల్గొన్న దంపతులచే ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు అనుగ్రహ భాషణ, అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యజ్ఞ యాగాదులు చేయడం వలనే సనాతన హైందవ సంస్కృతి సంప్రదాయాలు భావితరాలకు అందజేయగలిగిన వారమవుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పండితులను పీఠంలో ఘనంగా సత్కరించారు.

కబ్జా భూములపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐఎంఎల్ సభ్యులు

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని సీలింగ్ భూములను నైన్‌ఆప్స్77కి విరుద్ధంగా కబ్జాకు గురైన భూములను రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకోవాలని సీపీఎంఎల్ (రెడ్ స్టార్) డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘంతో కలిసి గిరిజనులు దళితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీలింగ్ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని పంచాయతీ పరిధిలోని బుల్లింపేట గిరిజనులకు, దళితులకు పంచాలని డిమాండ్ చేశారు. పీవోటీ యాక్ట్ ప్రకారం న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాళిబాబు, మడకం రామన్న, లింగాల దుర్గారావు, మహిళా సంఘం నాయకురాలు గన్నమణి నాగమణి, కె.కుమారి, పూసం దుర్గమ్మ, పి.నాగమణి, కె.గంగాధర్ దళితులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం రోటరీ క్లబ్‌కు ప్రశంసలు



విజయవాడలో కొయ్యలగూడెం రోటరీ సభ్యులను అభినందిస్తున్న గవర్నర్ దత్త సుబ్బారావు

కొయ్యలగూడెం: విజయవాడ కన్వెన్షన్ హాలులో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రోటరీ సత్కార కార్యక్రమంలో కొయ్యలగూడెం రోటరీ క్లబ్ శాఖ సభ్యులను సత్కరించినట్లు స్థానిక శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎ.విశ్వనాథ శర్మ, గొలిశెట్టి వాసు సోమవారం తెలిపారు. పోలియో ఫండ్‌కి కొయ్యలగూడెం రోటరీ క్లబ్ శాఖ ద్వారా లక్ష రూపాయలు అందజేయడం, క్లబ్ ద్వారా పదకొండు విభాగాలలో నిర్వహిస్తున్న సేవలకు సభలో ప్రశంసలు లభించాయని అన్నారు. సభ్యులందరికీ రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ దత్త సుబ్బారావు మెమెంటోలు సర్టిఫికెట్లను అందజేసి సత్కరించారని, దీంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ చోడిపిండి సుబ్రహ్మణ్యం, సభ్యులు మద్దు గోపి, మజ్జి సూరిబాబు, షేక్ అమీర్ బాషా, చిరువూరి సాయి, బొమ్మ దుర్గబాబు తదితరులు పాల్గొన్నారన్నారు.

ప్రశాంతంగా పింఛన్ల పంపిణీ



చింతలపూడి: సుప్రింపేటలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్



ద్వారకాతిరుమల: వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి

చింతలపూడి: చింతలపూడి మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. నగర పంచాయతీ పరిధిలోని సుప్రింపేట గ్రామంలోని మహిళకు ఆయన పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వెయ్యిరూపాయల చొప్పున రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేల పింఛన్‌ను సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులతో లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 42 వేల మంది వివిధ కేటగిరీల పింఛన్‌దారులకు రూ.29 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ఆంధోని నగర్, వెలగలపల్లి సచివాలయాల పరిధిలో కూడా పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలో సోమవారం పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్, జనసేన నాయకుడు కరాటం రాంబాబు స్థానిక 18 వార్డులో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లి పింఛన్ అందజేశారు.

లింగపాలెం: ధర్మాజీగూడెంలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కూటమి నేతలతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు.

కామవరపుకోట: మండలంలో 8211 మంది పింఛనుదారులకు గాను 7915 మందికి పింఛన్లు అందజేశామని, తొలిరోజు 97శాతం పింఛన్ పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో స్వర్ణ భారతి తెలిపారు. రామన్నపాలెంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నేతలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ముందుగా మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తిమ్మాపురం, పంగిడిగూడెం, నారాయణపురం, గుణ్ణంపల్లి గ్రామాల్లో పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 7 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆర్డీవో కె.అద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు వినతులు సమర్పించారు. ఆయా సమస్యలపై 7 దరఖాస్తులు అందినట్లు ఆర్డీవో తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీరామచంద్ర మ్యాక్ సొసైటీలో సీనియర్ సిటిజన్స్, బ్రాహ్మణ పరిషత్ సభ్యులతో ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ రిటైర్మెంట్ తరువాత జీవనాన్ని సాఫీగా సాగేలా చేస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ పొదుపుపై అవగాహన పెంచుకోవడంతో పాటు, భావితరం పొదుపు పాటించేలా అనుభజ్ఞులు వారిని చైతన్య పరచాలన్నారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర గ్రూపు సంస్థల చైర్మన్ బీవీ కృష్ణారావు మాట్లాడుతూ తమ సంస్థలు ప్రారంభించి 32 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు చెప్పారు. మ్యాక్ సొసైటీ ద్వారా డిపాజిట్లకు అత్యధికవడ్డీ రేట్లు ఇవ్వడంతో పాటు, సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీవీ సత్యనారాయణ, వీవీఎస్ జగదీష్‌కుమార్, చిక్కాల సత్యనారాయణ, గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో సోమవారం ఓ స్కూల్ బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రమాదం ఉదయం జరగడంతో కొంతమేర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. స్కూల్‌కు వెళ్లేవారు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడ్డారు. ప్రమాద ఘటన తెలుసుకున్న ట్రాఫిక్ సిబ్బంది కారు, స్కూల్ బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

నాయకపోడులకు న్యాయం చేయాలని వినతి



చింతలపూడి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు

చింతలపూడి: లింగగూడెం రెవెన్యూలోని 107 ఎకరాల గయ్యాల భూమిలో సాగులో ఉన్న నాయకపోడు ప్రజలకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ కోరారు. ఈ మేరకు చింతలపూడి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత 40 ఏళ్లుగా నాయకపోడులు పోడుకొట్టుకుని అక్కడే గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. వీరికి ఇప్పటివరకు ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందలేదని, సాగుపట్టాలు, బోర్లు సౌకర్యం కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, సదరు భూములు విక్రయించడానికి గాని, కొనడానికి గాని ఎవరికీ ఎలాంటి హక్కులు లేవని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి సాగులో ఉన్న ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీ



సమావేశానికి హాజరైన కార్మికులు

చింతలపూడి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులు కార్మిక శాఖ ద్వారా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం ఇమ్మానియేలు డిమాండ్ చేశారు. చింతలపూడి భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం త్వరగా ఇసుక పాలసీని ప్రకటించాలని కోరారు. అనంతరం నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా జూపూడి వసంత, కార్యదర్శిగా బజారు కృష్ణ, సహాయ కార్యదర్శిగా చంద్రు కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కొత్త శ్రీను, కోశాధికారిగా దేశాబక్తుల వెంకట రమణ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కంచర్ల అబ్రహం, ఎస్‌కె సుబాని తదితరులు పాల్గొన్నారు.